లక్ష్యం ఘనం-కొనుగోళ్లు స్వల్పం

అరకొరగానే ధాన్యం కొనుగోళ్లు..
- నందిగామ సబ్‌డివిజన్‌లో 50వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యం
- ఇప్పటివరకు కొనుగోలు చేసింది 100 మెట్రిక్ టన్నులే
- 54కుగాను పనిచేస్తున్నవి 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలే
- దళారుల పాలవుతున్న ధాన్యం
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు


కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో ధాన్యం విక్రయాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

కంచికచర్ల/జగ్గయ్యపేట: వరిధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ లక్ష్యం ఘనంగా ఉన్నప్పటికీ..ఆచరణలో మాత్రం అందులో ఒక్కశాతం కొనుగోళ్లు కూడా పూర్తికాలేదు. నందిగామ సబ్‌డివిజన్ పరిధిలోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని 54 రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు లక్ష్యం కాగా, అందులో కేవలం 12చోట్ల మాత్రమే ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. సబ్‌డివిజన్‌లో 15,272 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టగా, రైతుల నుంచి 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పగా, ఇప్పటివరకు కేవలం 100 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తూ అయినకాడికే తక్కువ ధరకు పంటను తెగనమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

15,272 ఎకరాలలో వరి సాగు..

సబ్ డివిజన్‌లో రైతులు ఈ ఖరీఫ్‌లో మొత్తం 15,272 ఎకరాల్లో వరిపంటను సాగుచేశారు. నందిగామ మండలంలో 3,664 ఎకరాలు, కంచికచర్ల మండలంలో 1,308ఎకరాలు, చందర్లపాడు మండలంలో 1,796ఎకరాలు, వీరులపాడు మండలంలో 872ఎకరాలు, జగ్గయ్యపేట మండలంలో 3,339ఎకరాలు, పెనుగంచిప్రోలు మండలంలో 2,771ఎకరాలు, వత్సవాయి మండలంలో 1,522 ఎకరాల్లో రైతులు వరిపంటను సాగుచేశారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న 54 కేంద్రాల్లో మూడోవంతు కేంద్రాల్లో కూడా ధాన్యం కొనుగోళ్లు సాగడం లేదు. వరికోతలు ఇంకా పూరిస్థాయిలో సాగడం లేదని అధికారులు చెబుతుండగా, పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభంగాకపోవడంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు తెగనమ్ముకుంటున్నారు.


కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యం

రైతుకష్టం దళారుల పాలు..

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా రైతుల కష్టం దళారుల పాలవుతోంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోళ్లు అరకొరగానే సాగుతుండగా, దళారులు మాత్రం నేరుగా రైతు ఇళ్లవద్దకే వెళ్లి కొనుగోళ్లు చేపడుతున్నారు. వరిధాన్యం బస్తాకు రూ.1300 నుంచి రూ.1400 మాత్రమే చెల్లిస్తున్నారు. తెలంగాణలో క్వింటా ధాన్యానికి బోనస్‌గా రూ.500 ఇస్తుండటంతో జగ్గయ్యపేట ప్రాంతంలోని దళారులు, వ్యాపారులు కుమ్మక్కై ఇక్కడి ధాన్యాన్ని తెలంగాణకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటుండటం గమనార్హం. జగ్గయ్యపేట, తిరుమలగిరి, అనుమంచిపల్లి, అన్నవరం, బలుసుపాడు, బండిపాలెం, మల్కాపురం, తక్కెళ్లపాడు, గౌరవరం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి రైస్‌మిల్లు, అనుమంచిపల్లిలోని పద్మావతి రా బాయిల్ అండ్ రైస్ మిల్‌లో ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంది. అయితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతులు ఆయా మిల్లులకు ధాన్యం తీసుకువెళ్లి రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో చేసేదేమిలేక రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోక తప్పడం లేదు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో తెరుచుకోకపోగా, తెరుచుకున్న వాటిలోనూ కొనుగోళ్లు సాగకపోవడంతో అవికాస్తా నామమాత్రంగానే మిగిలాయని చెప్పవచ్చు.

బస్తా రూ.1400లకే విక్రయించాను..


నేను 10ఎకరాలలో మాగాణి సాగు చేశాను. ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి తెలియదు. దీంతో పంటను గ్రామంలోని దళారికి బస్తా ధాన్యం రూ.1400 చొప్పున విక్రయించాను. సాగు ఖర్చులు పెరిగినప్పటికీ తగిన ధర లభించక నష్టపోతున్నాం.

– సంపసాల లింగయ్య, షేర్‌మహ్మద్‌పేట, జగ్గయ్యపేట మండలం

మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు..


నేను నాలుగెకరాలలో మాగాణి సాగు చేశాను. రెండు రోజుల కిందట ప్రభుత్వం సూచించిన మిల్లు వద్దకు ధాన్యం తీసుకెళితే కొనుగోలు చేయలేదు. దీంతో చేసేది లేక ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాను. అధికారుల పని తీరు బాలేదు.

– చిలకల ఉపేంద్రరావు, షేర్‌మహ్మద్‌పేట, జగ్గయ్యపేట మండలం

క్లుప్తంగా

కాశీవిశ్వేశ్వరుడికి లక్ష బిల్వార్చన



జగ్గయ్యపేటఅర్బన్: గౌరీ పాడ్యమి సందర్భంగా సోమవారం పట్టణంలోని పాలేటి తీరాన వేంచేసియున్న శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష బిల్వార్చన, 1008 కిలోల కుంకుమతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రంగాపురం నరసింహారావు, సంకా వెంకట్రావు, సంకా భాస్కరరావు, నీలిశెట్టి వాసు, ఎన్నాకుల శ్రీధర్, డోగుపర్తి రాము, కావేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని రెండోవార్డులో సుమారు రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో పోలిస్తే శానిటేషన్ వ్యవస్థ మెరుగైందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 5.79లక్షలు

నందిగామటౌన్: భక్తులు సమర్పించిన కానుకల హుండీ ద్వారా రామలింగేశ్వరస్వామి వారికి రూ. 5.79 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో గంగాధర్ తెలిపారు. పట్టణంలోని శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో సోమవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ తొమ్మిది నెలల కాలానికి హుండీ ద్వారా రూ.5.79లక్షల ఆదాయం వచ్చినట్లు వివరించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, వంశపారంపర్య ధర్మకర్త మురళీ రాఘవకుమార్, ఏఎస్ఐ రమేష్, వీఆర్వో ముకుందాదేవి, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటకు సంబంధించిన ఆర్టీసీ సమస్యలపై ఆర్టీసీ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సోమవారం విజయవాడలో కలిశారు. జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోలో ఉన్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కొత్త సర్వీసులను ఏర్పాటుచేయాలని, బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఆర్టీసీ చైర్మన్‌ను కలిసినవారిలో గింజుపల్లి రమేష్, కల్యాణం కృష్ణారావు, మురళి, కాసరగడ్డ శ్రీనివాసరావు ఉన్నారు.

ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దుచేయాలని ధర్నా



కృష్ణలంక(విజయవాడతూర్పు): ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసి అదానీని అరెస్ట్ చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాణిగారితోటలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమీషన్ (ఈఆర్‌సి) పేరుతో దాదాపుగా రూ.15.50 వేల కోట్ల విద్యుత్ భారాలను రాష్ట్ర ప్రజలపై మోపుతుందన్నారు. ఇప్పటికే రూ.6072 కోట్ల భారాన్ని మోపిన ప్రభుత్వం మరో రూ.9412 కోట్ల జనవరి నుంచి వసూళ్లు చేసేందుకు సిద్ధపడుతుందని మండిపడ్డారు. గత ప్రభుత్వంపై నెపం నెట్టి దానిని చూపించి ప్రజల నెత్తిన వేల కోట్లు భారాలు వేయడం దుర్మార్గమని తెలిపారు. ప్రజలు గత ప్రభుత్వ భారాలు మోయలేక వారిని వద్దని ఎన్నికల ముందు మీరిచ్చిన హామీలను నమ్మి మిమ్ములను అందలం ఎక్కిస్తే ప్రజలకు మీరేమి వెలగబెడుతున్నారని సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లను ప్రశ్నించారు. ఒడ్డు దాటేవరకు ఓడ మల్లన్న దాటాక బోడి మల్లన్న అన్నట్లు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు చంద్రశేఖర్, డి.వర ప్రసాద్, ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ

వీరులపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్లు అందించిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు జిల్లా అంబుడ్స్‌మెన్ విచారణాధికారి చాట్ల ఇమ్మానియేలు తెలిపారు. 2023–24 ఆర్థికసంవత్సరంలో మండలంలోని గోకరాజుపల్లిలో చేపట్టిన ఉపాధి పనులపై సోమవారం ఆయన వీరులపాడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకరాజుపల్లిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో ఏపీవో జనార్దన్, ఫీల్డ్‌అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్రామంలో తాను పనులకు వెళ్లకపోయినా తనఖాతాలో రూ.15వేలు జమయ్యాయని ఓవ్యక్తి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు వివరించారు. ఏపీవో జనార్దన్, ఫీల్డ్ అసిస్టెంట్లను విచారించినట్లు ఆయన తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



జగ్గయ్యపేటఅర్బన్: సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన ఆర్థికసాయాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. ఏటిపట్టు గ్రామమైన నందిగామ మండలం మాగల్లుకు చెందిన బచ్చలకూరి వీరయ్య ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. వైద్య సహాయం కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.81,358 చెక్కును ఎమ్మెల్యే తాతయ్య సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. నాయకులు అప్పారావు, శేషగిరిరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : తన్నీరు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అండగా ఉంటానని ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం, కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తల సమావేశానికి 2వేల మంది వస్తారని అంచనా వేశామని, ఊహించని విధంగా అందుకు రెట్టింపు సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యారన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, మాజీసీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. ఇందుకు ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశానికి ప్రజల నుంచి లభించిన స్పందనే నిదర్శనమని గుర్తుచేశారు. కార్యకర్తలు, ప్రజలు ఇచ్చిన మద్దతుతో నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా వారికి అండగా నిలిచి ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, కౌన్సిలర్ వట్టెం మనోహర్, నాయకులు ఫిరోజ్‌ఖాన్, నంబూరి రవి, చౌడవరపు జగదీష్, బద్దునాయక్, బూడిద నరసింహారావు, మండవ శ్రీనివాసగౌడ్, కన్నెమాల శామ్యూల్, వేముల మల్లేశ్వరరావు, మాతంగి నాగబాబు, ఉపేందర్‌రెడ్డి, న్యాయవాది సత్యశ్రీనివాస్, గోగుల వెంకయ్య, వినోద్, హేస్సేన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

రైతుసంఘం నాయకులు


షేర్‌మహ్మద్‌పేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతుసంఘ నాయకులు విమర్శించారు. మండలంలోని షేర్‌మహ్మద్‌పేటలో సోమవారం వారు పర్యటించారు. రైతుల కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా రైతుసంఘం నాయకులు లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, కోట కృష్ణ మాట్లాడుతూ మాట్లాడుతూ సాక్షాత్తూ 25శాతం తేమ ఉన్న ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయడం లేదన్నారు. ఈ విషయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటనలు, అధికారుల తీరు వేర్వేరుగా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో తగిన శ్రద్ధ చూపించకపోవడంతో గ్రామాల్లో దళారులు ఇష్టారీతిన ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. వర్షాలు పడుతున్నందున కల్లాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం రాయితీపై పట్టాలు ఇవ్వడం లేదన్నారు. మిల్లు వ్యాపారులు, దళారులు కుమ్మక్కై రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం కల్లాల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

శానిటేషన్ వర్కర్లను తొలగిస్తే సహించం : సీఐటీయూ


శానిటేషన్ వర్కర్ల నూతన కమిటీ సభ్యులతో సీఐటీయూ నాయకుడు ముల్లంగి సోమేశ్వరరావు

కంచికచర్ల: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే శానిటేషన్ వర్కర్ల(ఆయా)లను తొలగించేందుకు కూటమి నాయకులు కుయుక్తులు పన్నుతుండటం తగదని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ముల్లంగి సోమేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శానిటేషన్ వర్కర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లను తొలగిస్తే సహించేది లేదన్నారు. శానిటేషన్ ఆయాలను తొలగించరాదంటూ డీఈవో యూవీ సుబ్బారావు ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీచేశారని గుర్తుచేశారు. ఎస్ఎంసీ కమిటీల పేరుతో శానిటేషన్ వర్కర్లను తొలగించేందుకు టీడీపీ నాయకులు సైతం ఆయా ఉపాధ్యాయులపై తీవ్రమైన వత్తిడి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ఐదునెలలుగా శానిటేషన్ కార్మికులకు జీతాలు అందకపోయినా వారు పనిచేస్తున్నారన్నారు. ఆయాలకు రెండు జతల యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు, శానిటేషన్ చీపుర్లు, ఫినాయిల్ సరఫరా చేయాలన్నారు. ప్రమాద బీమా, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల శానిటేషన్ వర్కర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

వైభవంగా సహస్ర లింగార్చన


స్వామి వారికి విశేష అలంకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో సోమవారం సహస్ర లింగార్చన వైభవంగా జరిగింది. ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించిన సహస్ర లింగార్చనను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ జరగగా, ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు పూజలో పాల్గొన్నారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పోలిని స్వర్గానికి పంపిన అనంతరం మల్లేశ్వర స్వామి వారి సన్నిధికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు


పెనుగంచిప్రోలు: మునేరులో అరటి దొప్పల్లో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పెనుగంచిప్రోలు: కార్తికమాసం ముగింపు గౌరీ పాడ్యమి సందర్భంగా సోమవారం శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శంభో శంకర..శంభో అంటూ ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కార్తికదీపాలు వెలిగించడంతోపాటు అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి మునేరు నీటిలో వదిలారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : పరమ శివునికి అత్యంత ప్రీతికరమైన కార్తికమాస సోమవారాన్ని పురస్కరించుకుని శైవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పోలీ పాడ్యమి సందర్భంగా తెల్లవారుజామునే భక్తులు శివాలయాలకు చేరి ప్రత్యేక పూజలు చేశారు. కంచికచర్లలోని అన్నపూర్ణాసహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో, శ్రీశివ సాయిక్షేత్రం, మండలంలోని గొట్టుముక్కల గంగా పార్వతి సమేత శంభులింగేశ్వరస్వామి ఆలయం, పరిటాల గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సామూహిక కుంకుమార్చనలు చేశారు. అర్చకులు కాకాని పవన్‌కుమార్, మొవ్వ వరప్రసాద్, కాకాని మల్లేశ్వరశర్మ, కాకాని సుమన్‌శర్మ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పరిటాల, కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు, కునికెనపాడు, ఎస్ అమరవరం, వేములపల్లి, పెండ్యాల, కీసర గండేపల్లి, పేరకలపాడు తదితర గ్రామాల్లో భక్తులు శైవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.


బ్రహ్మణబజారులో గాజుల అలంకారంలో అమ్మవారు

నందిగామ మండలంలో..

నందిగామటౌన్: గౌరీ పాడ్యమి సందర్భంగా మండలంలోని శైవాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయానికి తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామి, శుకశ్యామలాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి ఆలయం, గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, రాఘవాపురం, పల్లగిరి గ్రామాల్లోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివార్లను ప్రతేకంగా అలంకరంచి పూజలు నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామునే పుణ్యస్నానాలాచరించి అరటి దొప్పల్లో కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.


జుజ్జూరు సోమేశ్వరస్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: కార్తిక మాస సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని జుజ్జూరులో వేంచేసియున్న సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకం పూజలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. మహిళలు వేకువ జామునే పుణ్యస్నానాలాచరించి ఆలయాలకు చేరుకుని కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసంతర్పణ నిర్వహించగా గ్రామ నాయకులు పూలా రాంబాబు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కంచికచర్ల శ్రీశివసాయిక్షేత్రంలో సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న భక్తులు


ప్రత్యేకాలంకరణలో నందిగామ శుకశ్యామలాంబ అమ్మవారు


భక్తులతో కిటకిటలాడుతున్న నందిగామ రామలింగేశ్వరస్వామి ఆలయం


పెనుగంచిప్రోలు అమ్మవారి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: కార్తిక మాసం చివరి సోమవారం గౌరీ పాడ్యమి సందర్భంగా ఆయా ఆలయాలకు భక్తులు క్యూకట్టారు. బ్రాహ్మణబజార్‌లోని అన్నపూర్ణా సహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజ, గాజుల అలంకారం చేశారు. అర్చకులు నరసింహారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మండలంలోని కోటిలింగాల పంచముఖ అమృతలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గన్నవరానికి చెందిన ప్రతిన్ కూచిపూడి నాట్య అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాట్య అకాడమీకి చెందిన దివిజ సాయి, జోస్న, లాస్య, భావన, ఎస్ఎస్‌వి. కీర్తన, కస్తూరి, ఓస్న, చరణ్యలతో పాటు మరి కొంత మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమానికి ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.